
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

మంగళవారం 30 జూలై 2024

తిగుల్‌లో గ్రామ కంఠం **భూమి కబ్జా**
- కబ్జాకు పాల్పడిన వారిని నిలదీసిన కాలనీవాసులు

8లో



నంగునూరు శివారులో గొర్రెలదొడ్డిగా మారిన సివిల్ సప్లయ్ గిడ్డంగి

గొర్రెలదొడ్డిగా మారిన గిడ్డంగి

- **లోపించిన పర్యవేక్షణ.. ప్రజాధనం వృథా**
- **పట్టించుకోని అధికారులు**

నంగునూరు, జూలై 29 : ప్రజా అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటను కొనుగోలు చేసి సివిల్ సప్లయ్ ఆధ్వర్యంలో నిల్వ చేసేందుకు లక్షలాది రూపాయలతో నిర్మించిన గిడ్డంగులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గొర్రెలదొడ్డిగా మారాయి. ఆరేళ్లుగా గోదాంలో గొర్రెల మందను తోలుతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



శిలాఫలకాలు

సిద్దిపేట జిల్లా నంగునూరు గ్రామశివారులో నాగరాజుపల్లికి వెళ్లే మార్గంలో నాగులబండ వద్ద 2013 డిసెంబరు 19న న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎంపీ విజయశాంతి మండల స్థాయి గిడ్డంగి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిధుల కొరతతో పనులు నత్తనడకన సాగాయి. తెలంగాణ ఏర్పాటు తర్వాత టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండేళ్లకాలంలో పనులు పూర్తి చేసి 2015లో జనవరి 1న మంత్రి హరీశ్‌రావు ఆ గిడ్డంగిని ప్రారంభించారు. మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు, ఇలా అన్ని సౌకర్యాలు కల్పించారు. గిడ్డంగిని ప్రారంభించిన తర్వాత రెండు, మూడుసార్లు మాత్రమే బియ్యాన్ని నిల్వ చేశారు. ఆ తర్వాత వినియోగంలో లేకపోవడంతో నంగునూరుకు చెందిన ఓ వ్యక్తి ఆ గోదామును గొర్రెల దొడ్డిగా మార్చుకున్నాడు. దీంతో ప్రభుత్వం రూ.లక్షలు పోసి నిర్మించిన భవనం వృథాగా మారింది. ఈ విషయమై గతంలో గతంలో రెవెన్యూ అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అప్పటి తహసీల్దార్ భూపతి సదరు వ్యక్తిని పిలిపించి ఎలాంటి అనుమతి లేకుండా ప్రభుత్వ ఆస్తులను వినియోగించరాదని హెచ్చరించి గోదాంకు తాళం వేశారు. తర్వాత స్థానిక నాయకుల అండతో మళ్లీ ఆ వ్యక్తి గోదాం తాళాన్ని పగలగొట్టి యథావిధిగా గొర్రెల షెడ్డుగా మార్చేశాడు. గోదాంను వినియోగించే సదరు వ్యక్తిని పలువురు గ్రామస్థులు ప్రశ్నించగా "గోదామును నేను ఉచితంగా వాడుకుంటలేను.. స్థానికులకు, అధికారులకు పండుగలకు, అడిగినప్పుడు యాటను ఇస్తున్నా"నని చెప్పడం కొసమెరుపు. కొన్నేళ్లుగా ఇదంతా జరుగుతున్న రెవెన్యూ పౌర సరఫరాశాఖ అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

71 వేల మందికి రూ.728 కోట్లు



నేడే రెండో విడత రుణమాఫీ

- **రూ. లక్షన్నర వరకు రైతుల ఖాతాల్లో జమ**
- **మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం**
- **తొలి విడతలో ఉమ్మడి జిల్లాలో 1.70 లక్షల మందికి లబ్ధి**
- **సొసైటీ రుణాలపై చిక్కుముడి**



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై 29: రెండో విడత రుణమాఫీని నేడు అమలు చేయడానికి ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమైంది. ఆ దిశగా ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు వచ్చాయి. నేటి మధ్యాహ్నం 12గంటల నుంచి రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది. తొలి విడతగా రూ.లక్ష వరకు రుణాలు పొందిన రైతులకు మాఫీ జరిగింది. ప్రస్తుతం రూ.లక్షన్నర రుణాలను రెండో విడతగా మాఫీ చేయనున్నారు. ఇక చివరగా మూడో విడతలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని నిర్ణయించారు. ఆగస్టు 15వ తేదీలోపు తుది విడత పూర్తిచేస్తామని ప్రభుత్వం పలుమార్లు ప్రకటించింది. తొలి విడత రుణమాఫీని ఈ నెల 18వ తేదీన అమలు చేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,70,205 మంది రైతులకు ప్రయోజనం చేకూరింది. వీరిలో ఎక్కువగా మూడెకరాల లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు, రూ.30 వేల నుంచి రూ.40వేల వరకు రుణం తీసుకున్నవారు ఉన్నారు.

తొలి విడతలో రూ.902 కోట్లు

తొలి విడతగా ఉమ్మడి జిల్లాలోని రైతులకు రూ.902 కోట్ల రుణమాఫీ జరిగింది. 1,60,636 రైతు కుటుంబాలకు లబ్ధి జరిగింది. రాష్ట్రంలోనే అత్యధిక రుణమాఫీ జరిగిన తొలి రెండు నియోజకవర్గాలుగా సంగారెడ్డి జిల్లాలో అందోలు, సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నిలిచాయి. దుబ్బాక నాలుగో స్థానంలో నిలిచింది. నారాయణఖేడ్, నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాల రైతులకూ రూ.90 కోట్ల చొప్పున నిధులు సమకూరాయి.

నేడు 71వేల మందికి..

నేడు మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండో విడతగా రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని అధికారికంగా పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వివరాలు సైతం బహిర్గతం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 71వేల పైచిలుకు రైతులకు ప్రయోజనం కలగనున్నది. ఈ రైతుల్లో 5 ఎకరాల లోబడి ఉన్నవారే అధికం. కాగా తొలి విడతలో ఉన్నట్లుగానే ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారులను రుణమాఫీ నుంచి మినహాయిస్తున్నట్లు తెలిసింది. వీరు పొందిన రుణాలతో ప్రభుత్వానికి సంబంధం లేదని తేల్చిచెప్పింది. అందుకే రుణమాఫీ లబ్దిదారుల సంఖ్య కూడా భారీగానే తగ్గుతోంది.

రెండో విడత రుణమాఫీ వివరాలు

జిల్లా	రైతులు	రుణమాఫీ(కోట్లలో)
సంగారెడ్డి	25,192	రూ.268.25
సిద్దిపేట	27,875	రూ.277.21
మెదక్	18,540	రూ.183.26

'సొసైటీ' రైతులకు మాఫీ జరిగేనా?

ప్రాథమిక సహకార సంఘాల్లో సభ్యులైన రైతులు కొంత మంది ఎస్‌బీహెచ్ బ్రాంచ్‌లో రుణాలు పొందారు. సొసైటీల్లోనే వీరి డాక్యుమెంట్లను పరిశీలించి రుణాలు సొసైటీ నుంచి కాకుండా ఎస్‌బీహెచ్ నుంచి ఇచ్చారు. ఎస్‌బీహెచ్ బ్యాంకు తర్వాతి రోజుల్లో ఎస్‌బీఐలో విలీనమైంది. దీంతో తమకు అన్యాయం జరిగిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారం పీఏసీఎస్ సొసైటీ పరిధిలో 1,369 మంది రైతులకు రూ.4.25 కోట్ల రుణం మాఫీ కావాల్సి ఉన్నా కాలేదు. ఇదేవిధంగా సంగారెడ్డి జిల్లాలోని మల్కాపూర్, కొండాపూర్, నందికంది, నాగాపూర్ తదితర 16 సొసైటీల్లో ఈ పరిస్థితి ఉన్నట్లుగా తెలుస్తోంది. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ సొసైటీ ఖాతాదారులకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయి. తొలివిడతలో మాఫీ జరగకపోవడంతో కనీసం రెండో విడతలోనైనా తమకు లబ్ధి చేకూరుతుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు.

వీరభద్రా.. నీ భూమి భద్రమేనా!?


- **షబాషీగూడెం ఆలయ భూమిపై వివాదం**
- **1981లో 7.30ఎకరాలు విరాళమిచ్చిన పట్టాదారుడు**
- **దేవాదాయశాఖ రికార్డుల్లోనూ నమోదు**
- **ఇరు శాఖల మధ్య సమన్వయ, సమాచారలోపం**
- **2013లో కూతురు పేరిట పట్టా**
- **ఏడాదిన్నరక్రితం ఆమె వారసుడి పేరిట పట్టామార్పిడి**
- **అక్రమ పట్టారద్దు చేయాలని గ్రామస్థుల ఆందోళన**



వీరభద్ర ఆలయం

చేర్యాల, జూలై 29 : చేర్యాల మండలం షబాషీగూడెంలో కొలువైన వీరభద్రస్వామికి పెద్దచిక్కే వచ్చిపడింది.!! దేవాదాయ, రెవెన్యూశాఖాధికారుల మధ్య సమన్వయం, సమాచారలోపం కారణంగా దేవుడిభూమిపై వివాదం రాజుకుంది. స్వామి వారి ఆలయం, భూమి వివరాలు దేవాదాయశాఖ పరిధిలో పొందుపరిచినప్పటికీ భూములను పరిరక్షించుకోవడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడం, రెవెన్యూ అధికారులు సైతం పూర్వాపరాలు పూర్తిగా పరిశీలించకుండానే పట్టామార్పిడి చేయడంతో అసలుకే ఎసరువచ్చింది. అయితే, అక్రమంగా పట్టా చేయడం తగదని, దేవుడి పేరిట పట్టాదారు పాసుబుక్కులు అందించాలని స్థానికులు ఆందోళన బాట పట్టారు. ఏడాదిన్నరక్రితం అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రా లు సమర్పించడంతో పాటు కోర్టును ఆశ్రయించారు. ఇటీవల పట్టాదారుడి వారసుడు భూమి కొలతలు చేయించి హద్దుల నిర్ధారణకు ఉపక్రమించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లేనిభూమిని అక్రమంగా కాజేయాలని యత్నిస్తుండటం తగదని మండిపడుతూ ఆందోళన చేపట్టారు. జరిగిన తప్పిదంపై రెండుశాఖల అధికారులు భిన్న ప్రకటనలు చేస్తుండడంతో అసలు భూమి ఎవరిది...ఎవరికి చెందుతుందన్న అయోమయం నెలకొన్నది.

షబాషీగూడెం శివారులో ఎన్నోయేళ్లక్రితం వీరభద్రుడు, శివాలయం నిర్మించారు. ఆలయానికి ఆదాయవనరులు లేకపోవడంతో ఉప్పల రామచంద్రయ్య నాగపురి గ్రామరెవెన్యూ పరిధిలో సర్వే నెం.705లో 7.30 ఎకరాల వ్యవసాయభూమిని 1981లో విరాళంగా ఇచ్చాడు. అప్పటికే ఆయన హరిజనుల ఇళ్ల స్థలాల కోసం సుమారు మూడుఎకరాల భూమి అందించాడు. ఆయా భూములపై తన వారసులకు ఎలాంటి హక్కులు ఉండవని పత్రములో రాయించి ఇచ్చాడు. తహసీల్ పహణీ రికార్డులలో 1981 నుంచి 2012వరకు పట్టాదారుడిగా ఉప్పల రామచంద్రయ్య పేరు ఉండగా, కాస్తుకాలంలో ఆలయం అమలు వచ్చినది. కానీ సంబంధిత భూమిని దేవాదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకోవడంలో నిర్లక్ష్యం వహించడం, ప్రస్తుతం భూములకు డిమాండ్ రావడంతో తిరిగి అతడి వారసులు స్వాధీనపరుచుకునేందుకు యత్నిస్తుండటం కలకలం రేపుతుంది.



1981లో రామచంద్రయ్య ఆలయానికి విరాళంగా రాయించి ఇచ్చిన పత్రం

వైకుంఠధామ నిర్మాణంతో బయటపడిన తతంగం

ఉప్పల రామచంద్రయ్య హరిజనులకు, ఆలయానికి భూమిని విరాళంగా ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఆలయానికి ఇచ్చిన భూమిని తహసీల్ రికార్డులలో సర్దుబాటు చేయలేదు. 2013లో అప్పటి అధికారులు రామచంద్రయ్య కూతురు ఎలిశాల లక్ష్మి పేరిట పట్టామార్పిడి చేశారు. ఈవిషయం బయటకు పొక్కలేదు. షబాషీగూడెం కాలనీ గతంలో నాగపురి గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. నూతన జిల్లాల నేపథ్యంలో గ్రామపంచాయతీగా ఏర్పడింది. ప్రభుత్వం ప్రతీ గ్రామంలో వైకుంఠధామం, నర్సరీ, డంపింగ్‌షెడ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంది. షబాషీగూడెంలో ప్రభుత్వస్థలం అందుబాటులో లేకపోవడం, పద్మశాలీ కులస్తులు యేళ్లతరబడిగా శ్మశానవాటికగా వినియోగిస్తుండటంతో గ్రామస్థులంతా కలిసి ఆలయ భూమిలో కొంత మేర కేటాయించాలని భావించారు. దీంతో ఆలయ భూముల్లో వైకుంఠధామం, డంపింగ్‌షెడ్ పనులు చేపట్టారు. అప్పటికీ భూమి విషయాన్ని అధికారులెవరూ గుర్తించలేదు. నిర్మాణ విషయం తెలుసుకున్న ఎలిశాల లక్ష్మి తమ పట్టాభూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం తగదని అడ్డుచెబుతూ కోర్టును ఆశ్రయించారు. తద్వారా నిర్మాణాలు నిలిచిపోయాయి. డిసెంబరు 2022లో సంబంధిత భూమి ఎలిశాల ఆనంద్ పేరిట మార్పిడి చేయడంతో అగ్గిరాజుకుంది. తహసీల్ అధికారులు రూ.లక్షల్లో మామూళ్లు పొంది మార్పిడి చేశారంటూ ఆరోపణలు వస్తున్నాయి.

కొనసాగుతున్న స్థానికుల ఆందోళనలు

ప్రభుత్వ భూములు, ఆలయ భూములను ప్రొహిబిటెడ్ జాబితాలో పొందుపరిచినప్పటికీ వీరభద్ర ఆలయ భూములను పట్టించుకోకపోవడం, ధరణి పోర్టల్‌లో నమోదు చేయకపోవడంతో సులువుగా పట్టా మార్పిడి జరిగింది. ఈవిషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో పట్టా రద్దు చేసి దేవుడి పేరిట పాసుబుక్కులు మంజూరుచేయాలని గ్రామస్థులు కొన్నాళ్లక్రితం తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించారు. పట్టాదారులతో పాటు గ్రామస్థులు కూడా భూమిని కోల్పోకుండా ఉండేందుకు ఎవరికి వారుగా ప్రయత్నాలు చేస్తున్నారు. కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్ కూడా పొందారు. కానీ ఆనంద్ ఇటీవల ఏడీతో భూమి కొలతల నిర్వహణకు ఉపక్రమించిన నేపథ్యంలో గ్రామస్థులంతా మరో మారు ఏకమై సర్వే చేపట్టవద్దంటూ ఆందోళన చేపట్టారు. తహసీల్దారుకు వినతిపత్రం అందించారు.

దేవాదాయశాఖ రికార్డుల్లో నమోదైంది

- విశ్వనాథశర్మ, దేవాదాయశాఖ అధికారి

వీరభద్రస్వామి ఆలయంతో పాటు ఉప్పల రామచంద్రం దానపూర్వకంగా ఇచ్చిన ఏడెకరాలముప్పయిగుంటలుభూమి వివరాలు దేవాదాయశాఖ 43 రిజిస్టర్‌లో నమోదైంది. పట్టామార్పిడి జరిగిందన్న విషయం తెలిసిన వెంటనే పాసుబుక్కుల రద్దుకోసం తహసీల్ కార్యాలయాధికారులకు లేఖ పంపించాం. దేవాలయభూమి పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం.


ఆలయ భూమిని కాపాడుకుంటాం

- వుల్లంపల్లి కరుణాకర్, నాగపురి

ఆలయానికి విరాళంగా ఇచ్చిన భూమిని ఎట్టి పరిస్థితులలోనూ వదులుకోము. విరాళంగా అందించినప్పుడు దస్తూరి రాసిన వారితో పాటు సాక్షులు ఇప్పటికీ జీవించే ఉన్నారు. స్థానికంగా లేకుండా, ఏనాడూ భూమి గురించిగానీ, ఆలయం గురించి పట్టించుకోనివారు అక్రమంగా భూమిని కాజేయాలని చూస్తున్నారు. గతంలోనే సర్వే చేపట్టినప్పటికీ మోఖాపై భూమి తేలలేదు. తిరిగి ఏడీ ద్వారా సర్వేచేపట్టేందుకు ఎలాంటి ఆస్కారంలేదు. దేవాదాయశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు చొరవ వహించి దేవుడి భూమి కాపాడాలి.



ఆలయ భూమిలో ఏర్పాటుచేసిన బోర్డు




తహసీల్ రికార్డుల్లో అనుభవదారులలో ఆలయంపేరు నమోదైన దృశ్యం

అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- **సిద్దిపేట శిల్పారామం, వెయ్యి పడకల ఆసుపత్రి పనులు ప్రారంభించాలి**
- **అసెంబ్లీ స్పీకర్‌కు హరీశ్‌రావు ప్రతిపాదనలు**

సిద్దిపేట టౌన్, జూలై29: సిద్దిపేట నియోజకవర్గంలో ఆగిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కట్ మోషన్‌లో పలు ప్రతిపాదనలు చేస్తూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చేసిన ప్రతిపాదనలపై హరీశ్‌రావు కట్ మోషన్ సమయంలో 17అంశాల్లో సిద్దిపేట నియోజకవర్గంలోని మూడు అంశాలపై మాట్లాడేందుకు సభాపతిని కోరినట్లు తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక నిధులు మంజూరు చేశామని, ఆ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని కోమటిచెరువు ప్రాంతంలో మరింత పర్యాటక శోభను తెచ్చేలా రూ. 15 కోట్లతో నిర్మిస్తున్న శిల్పారామం పనులు నిలిపి వేశారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజ్ అనుబంధంగా నిర్మించిన వెయ్యి పడకల ఆసుపత్రి పనులు అర్థాంతరంగా ఆపారని, తక్షణలే పనులు ప్రారంభించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన కోరారు. గత ప్రభుత్వంలోనే ఆసుపత్రిని ప్రారంభించుకున్నామని కొన్ని పనులు మిగిలి పోయి ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం నడుస్తున్న ఆసుపత్రిని వెయ్యి పడకల ఆసుపత్రికి బదిలీ చేయలేకపోయామని, ఈ పనులు పూర్తవుతే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు.



URBAN DEVELOPMENT

5. Sri Thanneeru Harish Rao

To reduce the allotment of Rs.15533,21,44,000/- for Municipal Administration and Urban Development by — Rs.100/-

Pending Bills ...

DEMAND NO.VI - EXCISE ADMINISTRATION

6. Sri Thanneeru Harish Rao

To reduce the allotment of Rs.413,01,90,000/- for Excise Administration by — Rs.100/-

... Som distilleries ... Bhoom Bhoom Beer, Beeryani Beer ... Brands.

7. Sri Thanneeru Harish Rao

To reduce the allotment of Rs.413,01,90,000/- for Excise Administration by — Rs.100/-

Siddipet ... Shilparamam ...

8. Sri Thanneeru Harish Rao

To reduce the allotment of Rs.413,01,90,000/- for Excise Administration by — Rs.100/-

... Depot ... excise ... Arrests.

DEMAND NO.X-HOME ADMINISTRATION

9. Sri Thanneeru Harish Rao

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఎమ్మెల్యే హరీశ్‌రావు అందజేసిన ప్రతిపాదనలు

జిల్లాలో జోరుగా పేకాట

- **వ్యవసాయ క్షేత్రాలు, ఫాంహౌస్‌లు, లాడ్జిలే అడ్డాలు**
- **6 నెలల్లో 169 మంది అరెస్టు**



సిద్దిపేట క్రైం, జూలై 29 : జిల్లాలో పేకాట జోరుగా సాగుతున్నది. నిత్యం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేస్తూ, పేకాటరాయుళ్లను అరెస్టు చేస్తున్నా కొందరు మారడం లేదు. ఎప్పటికప్పుడు అడ్డాలు మారుస్తు తమ ఆటను కొనసాగిస్తున్నారు. కొందరు సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతంలో వ్యవసాయ క్షేత్రాల వద్ద ఆడుతుండగా, మరికొందరు వ్యవసాయ బావుల వద్ద, ప్రత్యేకంగా ఫాంహౌస్‌లు ఏర్పాటు చేసుకొని ఆడుతున్నారు. ఇంకొందరు లాడ్జిల్లో ప్రత్యేకంగా నెలరోజుల పాటు రూంలు తీసుకుని పగలు, రాత్రి పేకాట ఆడుతున్నారు. గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక పట్టణాల్లో కూడా ప్రతిరోజూ పేకాట కొనసాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొందరు పేకాట శిబిరాల వద్దకే మందు, మాంసం, బిర్యానీ తెప్పించుకుంటున్నారు. ఇక గ్రామాల్లో వ్యవసాయబావుల వద్ద ఆడుతూ గ్రామానికి ఎవరైనా వస్తే సమాచారం ఇచ్చే విధంగా ఒక ఇన్‌ఫార్మర్‌ను పెడుతున్నారు. ఆ గ్రామానికి పోలీసులు వస్తే ఇన్‌ఫార్మర్ ఆటగాళ్లకు సమాచారం ఇవ్వగానే వారంతా పారిపోతున్నారు. ఆటలో డబ్బు పోయిన వారికి అక్కడే అధిక వడ్డీకి అప్పు ఇచ్చేవారు కూడా ఉంటున్నారు.

జిల్లాలో ఆరునెలల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 29 కేసులు నమోదు చేసి 164 మందిని అరెస్టు చేశారు. ఆటగాళ్ల నుండి స్వాధీనం చేసుకున్న రూ.6,56,854లను కోర్టులో డిపాజిట్ చేశారు.

చట్ట ప్రకారం చర్యలు తప్పవు

- బీ.అనురాధ, సీపీ

పేకాట ఆడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా ఎవరైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. పేకాట ఆడుతూ అనవసరంగా అప్పుల పాలవుతూ జీవితాన్ని పాడు చేసుకోకూడదు. జిల్లాలో అన్నిచోట్ల ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి టాస్క్‌ఫోర్స్ పోలీసులతో దాడులు నిర్వహించి పేకాటరాయులను అరెస్టు చేస్తున్నాం.

'20 రోజులుగా నీళ్లు మోస్తున్నా'..

మద్దూరు, జూలై 29 : "మద్దూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మోటారు పాడై 20 రోజులు కావొస్తుంది. నీళ్ల లేక ఇబ్బంది అవుతుంది. అయినా ఎవరూ పట్టించుకుంటలేరు. ఎదురుగా ఉన్న ఐకేపీ కార్యాలయంలోని నీటి సంపు నుంచి బకెట్‌తో నీళ్లు తెచ్చి పోసుడు తప్పడం లేదు" ఇదీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న అటెండర్ యాదగిరి మాట..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సమస్యల పరిష్కారానికి రెండేళ్ల క్రితం 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.25లక్షలు మంజూరు చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఎలక్ట్రిక్, ప్లంబింగ్ పనులను తూత మంత్రంగా చేశాడు. దీంతో ఆసుపత్రిలో శ్లాబు నుంచి నీరు ఉరుస్తుంది. సదరు కాంట్రాక్టర్ ఆసుపత్రికి ప్రత్యేక బోరు ఏర్పాటు చేయలేదు. సంపులోని మోటారు ద్వారా అవసరాలను వెళ్లదీసుకుంటున్నారు. ఈ క్రమంలో 20 రోజుల నుంచి మోటారు పాడై నీరు రావడం లేదు. దీంతో అటెండర్ ఐకేపీ కార్యాలయం నుంచి బకెట్‌లో నీటిని మోస్తున్నాడు. కనీస నీటి వసతి లేకపోవడంతో విధులు నిర్వహించడం ఇబ్బందిగా ఉందని, యుద్ధప్రాతిపదికన నీటి వసతిని ఏర్పాటు చేయాలని ఆస్పత్రి సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు.



ఐకేపీ కార్యాలయం నుంచి బకెట్‌తో నీటిని తెస్తున్న అటెండర్

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

గజ్వేల్, జూలై 29: వర్గల్ మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన నీల ఎల్లం(53) కొన్నాళ్లుగా ప్రజ్ఞాపూర్‌లోని వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్నాడు. సోమవారం ట్రాక్టర్ సహాయంతో పొలాన్ని దున్నుతుండగా కరెంట్ వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఎల్లం కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

రిజర్వాయర్లకు నీటిని విడుదల చేయలేదంటే

రాజీవ్‌రహదారిని దిగ్బంధం చేస్తాం

● బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూలై 29: మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లను నీటితో నింపాలని, లేదంటే రాజీవ్ రహదారిని దిగ్బంధం చేస్తామని బీఆర్ ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటుతున్నా ఇప్పటివరకు నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. ఆయనవెంట మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయోద్దీన్ తదితరులున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకొని యువకుడి ఆత్మహత్య



శివ(ఫైల్)

శివ్వంపేట, జూలై 29 : బోనాల పండుగ రోజు యువకుడు ఆత్మహత్య చేసుకుని తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చిన సంఘటన మండల పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు దొంతి గ్రామానికి చెందిన సోము శివ(25) ఏపని చేయకుండా అల్లరిచిల్లరగా తిరుగుతుంటాడు. తల్లిదండ్రుల మాట వినకుండా చిరాకుపడుతూ విచిత్ర మనస్థత్వంతో ప్రవర్తిస్తాడు. శివ గతేడాది బోనాల పండుగ రోజున ఇంటి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్లను పట్టుకోవడంతో చేతికి తీవ్రగాయమైంది. వైద్యులు కుడి చేయిని తొలగించారు. కాగా మళ్లీ ఆదివారం రాత్రి బోనాల దగ్గర నుంచి కొడుకు శివను ఇంటికి రమ్మని తండ్రి శ్రీరాములు పిలిచాడు. తాను ఇంటికి రాను అంటూ రెండోసారి ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళ్లి వైర్‌ను ముట్టుకోవడంతో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు.

బెట్టింగ్‌లకు అలవాటు పడి దొంగతనం

రేగోడు జూలై 29: ఆన్‌లైన్‌లో బెటింగ్‌లకు అలవాటు పడి దొంగతనం చేసి కటకటాల పాలైన సంఘటన రేగోడు మండలంలో చోటుచేసుకుంది. రేగోడు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం అల్లాదుర్గం సీఐ రేణుక తెలిపిన వివరాలు వెల్లడించారు. రేగోడు మండలంలోని మక్త వెంకటాపురంలో ఈనెల 22న పట్టపగలు ఓ ఇంట్లో చోరీ జరిగింది. రూ2.10 లక్షల నగదు, రెండున్నర తులాల బంగారం అపరించారు. బాధితుడు సంగప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేగోడు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. అదే గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ సిద్దిపేట జిల్లా చేర్యాల గ్రామంలో మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్నాడు. అతనిపై అనుమానంతో పోలీసులు విచారణ చేపట్టగా దొంగతనం బయటపడింది. జ్ఞానేశ్వర్ చోరీ చేసిన నగదును అతని భార్యకు ఇవ్వగా ఈ డబ్బు ఎక్కడిదని నిలదీసింది. ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా గెలుచుకున్న అంటూ చెప్పాడు. ఆ డబ్బును రికవరీ చేసి కోర్టులో డిపాజిట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కోసమే దొంగతనం చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారణ వచ్చామని తెలిపారు.

ముగ్గురు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

అల్లాదుర్గం, జూలై 29 : ముస్లాపూర్‌లో తల్లి తన ముగ్గురు పిల్లలతో కలసి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన చిన్నకటిక యాదుల్మియ భార్య షకీరా(30) తన కూతురు షఫీమహీన్(8), ఆఫ్షీన్(6) ముమ్తాజూర్(4)తో శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాలేదు దీంతో భర్త యాదుల్మియ పలు చోట్ల గాలించినప్పటికిని వారి ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అత్తపై కత్తితో అల్లుడి దాడి

చేర్యాల, జూలై 29 : అత్తపై అల్లుడు కత్తితో దాడిచేసిన సంఘటన కొమురవెల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. కొమురవెల్లి గ్రామానికి చెందిన పాతకోటి చంద్రకళ మల్లన్న ఆలయ సమీపంలోని రాతి గీరెలు సమీపంలో బొమ్మలు విక్రయించుకుంటూ జీవిస్తుంది. ఆమెకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. పెద్దకుమార్తె మౌనిక వివాహం 2010లో లక్ష్మీదేవిపల్లికి చెందిన ఎల్లారెడ్డితో జరిగింది. కొంతకాలంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో మౌనిక తల్లివద్దే ఉంటుంది. ఈ విషయమై అల్లుడు ఎల్లారెడ్డి ఆదివారం రాత్రి కొమురవెల్లికి చేరుకుని కత్తితో చంద్రకళపై దాడికి పాల్పడ్డాడు. దీంతో గాయాలపాలైన ఆమె సోమవారం కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపారు.

బ్యాంకు నిర్లక్ష్యం.. రైతులకు శాపం

● సీడెడ్ సొసైటీ సభ్యులకు రుణాల రెన్యూవల్ చేయని ఎస్‌బీఐ
● రుణమాఫీకి నోచుకోని సొసైటీ రైతులు



కొండాపూర్ పీఏసీఎస్ కార్యాలయం

కొండాపూర్/నారాయణఖేడ్, జూలై 29 : బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం సీడెడ్ సహకార సంఘాల్లోని రైతులకు శాపంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా రుణమాఫీతో రైతులు సంబురాలు జరుపుకుంటుండగా సంగారెడ్డి జిల్లాలోని 16 ప్రాథమిక సహకార సంఘాల రైతుల్లో మాత్రం అయోమయం నెలకొన్నది. ఈ సహకార సంఘాలకు గతంలో ఎస్‌బీహెచ్ బ్యాంకు రుణాలను మంజూరు చేసింది. అయితే, ఈ బ్యాంకు ఎస్‌బీఐలో విలీనం తర్వాత పరిస్థితి తలకిందులైంది. ఎస్‌బీఐ సీడెడ్ సొసైటీలకు రుణాలు ఇచ్చేందుకు నిరాకరించింది. అంతేకాకుండా, పాత రుణాలను సైతం రెన్యూవల్ చేయడంలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీ ఈ సొసైటీ సభ్యులకు వర్తించడం లేదు.

ఎనిమిది వేలకుపైగా రైతులు

జిల్లావ్యాప్తంగా 53 ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘాలున్నాయి. అందులో సీడెడ్ సొసైటీలు 16 పీఏసీఎస్‌లు కొనసాగుతున్నాయి. వీటిలో 8 వేలకుపైగా రైతులు రుణాలను పొందారు. సంగారెడ్డి డివిజన్ పరిధిలో ఆరు పీఏసీఎస్‌లు సీడెడ్ సొసైటీలుగా కొనసాగుతున్నాయి. అవి మల్కాపూర్, కొండాపూర్, నందికంది, నాగాపూర్, తేర్పోల్, రుద్రారం. వాటి పరిధిలో 3,188 మంది రైతులు రుణాలు పొందారు. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో మొత్తం 12 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా ఆరు సీడెడ్ సొసైటీలు ఉన్నాయి. అవి సంజీవన్‌రావుపేట, గంగాపూర్, కడ్పల్, మార్డి, బీబీపేట, కల్హేర్. వాటి పరిధిలోని 2,615 మంది రుణాలను పొందారు. గతంలో ఎస్‌బీహెచ్ కొనసాగిన సమయంలో వీరు రుణాలను పొందారు. 2017 మార్చి 31న ఎస్‌బీహెచ్ ఎస్‌బీఐలో బ్యాంకులో విలీనమైంది. అనంతరం ఎస్‌బీహెచ్ సీడెడ్ సొసైటీలకు రుణాల మంజూరులో మొండిచేయి చూపింది. పాత వాటిని చెల్లించి కొత్త రుణాలను పొందాలని రైతులకు నోటీసులు సైతం పంపారు.

డిపాజిట్లు ఉన్నా రెన్యూవల్‌కు నో

రాష్ట్ర ప్రభుత్వం 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 మధ్యన రుణాలు పొందిన వారికి రుణమాఫీకి కటాఫ్ తేదీగా నిర్ణయించింది. మొదటి దశలో రూ.లక్షలోపు రుణాల మాఫీ చేసింది. ప్రస్తుతం రూ.1.50 వేల రుణాల మాఫీకి సిద్ధం అవుతుంది. 2017 నుంచి సీడెడ్ సొసైటీలకు సంబంధించి రుణాలను రెన్యూవల్ చేయకపోవడంతో సీడెడ్ సొసైటీల రైతులకు రుణాలు మాఫీ కావడం లేదు. అలాగే, పాత రుణాలకు వడ్డీ పెరిగి తడిసి మోపెడైంది. వాటిని చెల్లించకపోవడంతో కొత్త రుణాలు సైతం పొందేందుకు వీలు లేకుండాపోయింది. ఇటు రుణమాఫీ జరగక.. అటు కొత్త రుణాలు పొందే వీలు లేక సీడెడ్ సొసైటీ రైతులు దిక్కుతోచనిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సొసైటీలకు సంబంధించి డబ్బులు బ్యాంకు వారి వద్ద డిపాజిట్‌లు ఉన్నప్పటికీ కూడా రుణాలను రెన్యూవల్ చేయకపోవడంతో తీరని అన్యాయం జరిగిందని రైతులు పేర్కొంటున్నారు.

మాఫీ కానీ రుణాలు

సంగారెడ్డి డివిజన్ పరిధిలోని ఆరు సీడెడ్ సొసైటీల్లోని 3,188 రైతులకు సంబంధించి రూ.19.21 కోట్ల రుణాలు, నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని ఆరు సీడెడ్ సొసైటీల్లోని 2,615 మంది రైతులకు సంబంధించి రూ.11.84 కోట్ల రుణాలు పేరుకుపోయాయి. సంగారెడ్డి డివిజన్ పరిధిలోని మల్కాపూర్ పీఏసీఎస్‌లో 268 మంది రైతులకు రూ.357 కోట్ల రుణాలు ఉన్నాయి. కొండాపూర్ సొసైటీలో 633 మందికి 4.64 కోట్లు, నందికందిలో 181 మందికి రూ.1.45 కోట్లు, నాగాపూర్‌లో 550 మందికి రూ.3.39 కోట్లు, తేర్పోల్‌లో 187 మందికి రూ.1.88 కోట్లు రుద్రారం సొసైటీలోని 1369 మంది రైతులకు రూ.4.25 కోట్ల రుణాలు మాఫీ కావాల్సి ఉంది. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని మార్డి సొసైటీ పరిధిలో 468 మంది రైతులకు రూ.2.21 కోట్లు, కడ్పల్‌లో 320 మందికి రూ.1.80 కోట్లు, సంజీవన్‌రావుపేటలో 431 మందికి రూ.2.29 కోట్లు, కల్హేర్ పరిధిలో 328 మందికి రూ.1.32 కోట్లు, బీబీపేట సొసైటీ పరిధిలోని 997 మంది రైతులకు రూ.3.34 కోట్ల రుణాలు మాఫీ కాకుండాపోయింది. సహకార బ్యాంకు పరిధిలోని వారికి రుణాలు మాఫీ కాగా, ఎస్‌బీఐ, ఎస్‌బీహెచ్‌లు విలీనం కావడానికి తోడు తమ సహకార సంఘాలను సీడెడ్ సొసైటీలుగా ఉంచడంతోనే రుణమాఫీ వర్తించలేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి తమకు రుణమాఫీ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సీడెడ్ సంఘంగా ఉండడంతోనే నష్టం



మా సహకార సంఘం సీడెడ్ సహకార సంఘంగా ఉండడంతోనే నష్టం వాటిల్లింది. మా సంఘాన్ని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో విలీనం చేస్తే ఈ సమస్య ఉండేది కాదు. సంఘం పరిధిలోనే 431 మంది రైతులకు నష్టం వాటిల్లింది.

- గునుకుల సంజీవరెడ్డి, సంజీవన్‌రావుపేట సొసైటీ

మాకు రుణమాఫీ వర్తింపజేయాలి



రుణమాఫీ పొందడానికి మాకు అన్ని అర్హతలు ఉన్నాయి. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతోనే మాఫీ కావడం లేదు. ప్రభుత్వం స్పందించి కల్హేర్ పీఏసీఎస్ రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలి.

- సంగమేశ్వర్ కులకర్ణి, కల్హేర్ పీఏసీఎస్ మాజీ చైర్మన్

బ్యాంకుల విలీనంతో సమస్య



ఎస్‌బీఐ, ఎస్‌బీహెచ్‌ల విలీనంతో సీడెడ్ సొసైటీల్లోని రైతులు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. సొసైటీలు ఎస్‌బీహెచ్ పరిధిలో ఉన్నప్పుడు రైతులకు అన్ని రకాల రుణాలు ఇచ్చారు. విలీనం అయ్యాక కొత్త రుణాలు ఇవ్వడం లేదు. పాత రుణాలను రెన్యూవల్ చేయడం లేదు. దీంతో రుణమాఫీ దక్కకుండా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

-మహేష్‌రెడ్డి, సంజీవన్‌రావుపేట సొసైటీ సీఈవో

మాపై వివక్ష చూపొద్దు



గత ప్రభుత్వంలో రుణమాఫీ కాలేదని రెన్యూవల్ చేయలేదు. కటాఫ్ తేదీలు ప్రకటించడంతో మేము దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. 2017కు ముందు లక్షా యాభై వేలు అప్పు తీసుకుంటే ఇప్పుడు మిత్తే రూ.లక్షా 85వేలు మొత్తం 3 లక్షల 35 వేలు అయ్యింది. మాపై వివక్ష చూపకుండా మాఫీ వర్తించేలా చూడాలని కోరుకుంటున్నాను.

- నాగప్ప, గారకుర్తి

సన్న, చిన్నకారు రైతులం కావడంతోనే..



సన్న, చిన్నకారుల రైతులం కాబట్టే సొసైటీల్లో సభ్యులుగా చేరి రుణాలు తీసుకున్నాం. పెద్దరైతులమైతే నేరుగా బ్యాంకుల్లోనే రుణాలు పొందేవాళ్లం. నిజమైన రైతులు అని అధికారులకు, బ్యాంకర్లకు తెలిసినా మాఫీ మాకు వర్తించదా. రుణాలు చెల్లించే శక్తి మాదగ్గర ఉంటే అసలుకు మూడింతల మిత్తిని మోసేభారం ఎందుకేసుకుంటాం. కటాఫ్ తేదీలను సొసైటీ రైతులకు వర్తించకుండా ప్రభుత్వమే రుణమాఫీ చేయాలని కోరుతున్నా.

- ఏ.లక్ష్మణ్, రైతు, మల్కాపూర్

ఓడీఎఫ్ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగా రిటైర్డ్ కావాలి

● ఏఐఏఎన్‌జీవోస్ ప్రెసిడెంట్ జయవర్ధన్ డిమాండ్

కంది, జూలై 29 : ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న దాదాపు 60 వేల మంది పైచిలుకు సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగా రిటైర్డ్ కావాలని ఏఐఏఎన్‌జీవోస్ (ఆల్ ఇండియా అసోసియేషన్ ఆఫ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్) ప్రెసిడెంట్ జయవర్ధన్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో సోమవారం ఆయన వివిధ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జయవర్ధన్ మాట్లాడుతూ 2021లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు కార్పొరేటీకరణ అయ్యాయని, అప్పుడు ఉద్యోగుల భవిష్యత్ సేవా షరతులపై సుమారు 70 మంది ఉద్యోగులను డీమ్డ్ డిప్యూటేషన్ ఏర్పాటు కింద ఏడు వేర్వేరు డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్‌లకు రీ అసైన్‌మెంట్ చేసిందన్నారు. ఇది వచ్చే సెప్టెంబరు 30వ తేదీతో ముగిస్తుందన్నారు. గతంలో ప్రసారభారతిలో పనిచేసిన ఉద్యోగులను వారు రిటైర్డ్ అయ్యేదాక ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, తమను కూడా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వెంటనే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. అలా జరగకుంటే తొలిదశలో ఆగస్టు 1వ తేదీన నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతామని, 6వ తేదీ రక్షణమంత్రికి మెమోరాండం సమర్పించి శాంతియుత నిరసనలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఐఏఎన్‌జీవోస్ ప్రధాన కార్యదర్శి అజయ్, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ నర్సింగ్ ఆఫీసర్లకు.. మూడు నెలలుగా వేతనల్లేవు!



సంగారెడ్డి అర్బన్, జూలై 29 : వారంతా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమితులైన వారు కాదు. ఏకంగా ప్రభుత్వం నియమించిన రెగ్యులర్ నర్సింగ్ ఆఫీసర్లు. రెగ్యులర్‌గా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు రావాలి. కానీ సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నూతనంగా నియమితులైన రెగ్యులర్ నర్సింగ్ ఆఫీసర్ల(స్టాఫ్ నర్సులు)కు మూడు నెలల వేతన బకాయిలు ఏర్పడ్డాయి. ఈ ఆస్పత్రిలో ఫిబ్రవరిలో 142 మంది నర్సింగ్ ఆఫీసర్లు నియమితులయ్యారు. సుమారు ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు రాలేదు. విచిత్రమేమిటంటే జూన్ నెలకు సంబంధించిన వేతనాలు మాత్రం వచ్చాయి. బకాయి పడ్డ మూడు నెలల వేతనాల కోసం నర్సింగ్ ఆఫీసర్లు నిత్యం ఆస్పత్రి కార్యాలయ అధికారుల వద్దకు చక్కర్లు కొడుతూనే ఉన్నారు. కానీ వారి నుంచి నేడు, రేపు వస్తాయనే సమాధానం మాత్రమే వినిపిస్తున్నదని నర్సింగ్ ఆఫీసర్లు పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బోధనాస్పత్రులతో పాటు టీవీవీపీ పరిధిలో కొత్తగా నియమితులైన అందరు నర్సింగ్ ఆఫీసర్లకు ఆ మూడు నెలల వేతనాలు వచ్చేశాయని, కానీ సంగారెడ్డి జీజీహెచ్ నర్సింగ్ ఆఫీసర్లకు రాకపోవడం గమనార్హం. ఆస్పత్రి కార్యాలయ అధికారుల నిర్లక్ష్యం వల్లే మూడు నెలల వేతనాలు ఇప్పటి వరకు రాలేదని పలువురు నర్సింగ్ ఆఫీసర్లు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన బకాయి పడ్డ మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించేలా చొరవ తీసుకోవాలని ఉన్నతాధికారులను నర్సింగ్ ఆఫీసర్లు కోరుతున్నారు.

మహాలక్ష్మి పథకం ద్వారా.. 3.80 కోట్ల మందికి ఉచిత ప్రయాణం

● ఆర్టీసీ ఆర్‌ఎం ప్రభులత

సంగారెడ్డి అర్బన్, జూలై 29 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మెదక్ రీజియన్‌లో ఇప్పటివరకు 3.80 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది డిసెంబరు 9 నుంచి నేటి వరకు ప్రతీ రోజు సుమారు లక్షా 70 వేల మంది మహిళలు ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఈ పథకం ప్రవేశపెట్టకముందు 70 శాతం ఓఆర్ ఉన్న ఆక్యుపెన్సీ రేషియో నేడు 98 శాతంగా ఉన్నదన్నారు. గతంలో రోజూ సుమారు 1.80 లక్షల మంది ప్రయాణిస్తుండగా, ప్రస్తుతం దాదాపు 2.60 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలు వినియోగించుకుంటున్నారన్నారు. మెదక్ రీజియన్‌కు నేటి వరకు 10 డీలక్స్, 35 పల్లె వెలుగు, 42 ఎక్స్‌ప్రెస్ బస్సులు, మొత్తంగా 87 కొత్త బస్సులు వచ్చాయని తెలిపారు. డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు గిఫ్ట్ స్కీమ్‌ను సిద్దిపేట, మెదక్, జహీరాబాద్ డిపోలలో ప్రారంభించామన్నారు. ఈ పథకాన్ని విజయవంతం చేయడానికి ప్రభుత్వం నూతన డ్రైవర్లు, శ్రామిక్, సూపర్‌వైజర్లు తదితర విభాగాల్లో 3,035 నియామకాలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు.

'గాయత్రి' యాజమాన్యంపై ముఖ్యమంత్రికి జుక్కల్ ఎమ్మెల్యే ఫిర్యాదు


● రైతుల పేరిట రూ.9 కోట్ల రుణాలు తీసుకున్న కర్మాగారంపై విచారణ జరపాలి


మాగి సమీపంలోని గాయత్రి చక్కెర కర్మాగారం

నారాయణఖేడ్, జూలై 29: రైతుల సంబంధం లేకుండా వారి పేరిట రుణాలు పొందిన గాయత్రి చక్కెర కర్మాగారం యాజమాన్యంపై విచారణ చేపట్టాలని కామారెడ్డి జిల్లా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేశారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మాగి శివార్‌లో ఉన్న గాయత్రి చక్కెర కర్మాగారం యాజమాన్యం రైతులకు పేరిట రూ.9 కోట్ల రుణాలను మోసపూరితంగా పొందిందన్నారు. నిజామాబాద్ పట్టణంలోని నాందేవ్‌వాడలోని యూనియన్ బ్యాంకుశాఖ నుంచి ఈ రుణాలను సేకరించిందన్నారు. కర్మాగారం ప్రారంభమయ్యాక చెరకు రైతుల నుంచి అగ్రిమెంట్‌పేరిట, బ్యాంకురుణపత్రాలపై మోసం చేసి సంతకాలు తీసుకుందని ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాన్నిమాఫీ చేసినట్లు రైతులకు ఎస్‌ఎంఎస్‌లు వెళ్లడంతో వెలుగులోకి వచ్చిందని తెలిపారు. పత్రికల్లో వార్తలు రావడంతో కర్మాగారం యాజమాన్యం హడావిడిగా ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసిన కుంటిసాకులు చెబుతూ తప్పించుకునే యత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ విషయమై కర్మాగారం యాజమాన్యంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. 'ఆంధ్రజ్యోతి'లో రుణమాఫీ ఫ్యాక్టరీ పాలు అని ఈనెల 24న వార్త కథనం ప్రచురితం కావడంతో, కలెక్టర్ ఈ విషయమై నారాయణఖేడ్ పరిధిలో విచారణ జరపాలని ఆదేశించారు. మనూరు మండలం తోర్నల్‌లో జిల్లా వ్యవసాయ అధికారిణి మూడు రోజుల క్రితం విచారణ చేపట్టారు.

బాగున్నావా 'జోగీ'

● ఏఎంసీ మాజీ చైర్మన్‌కు చంద్రబాబు పలకరింపు


ఏపీ సీఎం చంద్రబాబునాయుడితో గంగా జోగినాథ్‌గుప్తా

జోగిపేట, జూలై 29 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, సంగారెడ్డి-జోగిపేట-మెదక్ రైల్వే లైన్ సాధన సమితి కన్వీనర్ గంగా జోగినాథ్‌గుప్తా ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీకి వెళ్లిన గంగా జోగినాథ్ ఆయన ఉంటున్న బంగళా వద్ద నిల్చున్నారు. అప్పుడే బయటకు వచ్చిన చంద్రబాబు 'జోగీ' బాగున్నావా అంటూ ఆప్యాయంగా పలకరించడం విశేషం. తన బంగళాలోకి సెక్యూరిటీతో జోగినాథ్‌ను పలిపించుకున్నారు. ఈ సందర్భంగా జోగినాథ్ చంద్రబాబునాయుడిని సన్మానించారు. తనతో సుమారు 10 నిమిషాల పాటు మాట్లాడి, తన కుటుంబ యోగక్షేమాలు కనుక్కున్నారని గంగాజోగినాథ్ తెలిపారు.




పుల్కల్ మండలం చక్రియాల్‌లో బోనాల ఊరేగింపు, తూప్రాన్ పట్టణంలో శోభాయాత్ర

వైభవంగా బోనాలు

తూప్రాన్/నర్సాపూర్/శివ్వంపేట/జోగిపేట/పుల్‌కల్, జూలై 29 : మెదక్, సంగారెడ్డి జిల్లాలోని పలుచోట్ల బోనాల పండుగ వైభవంగా కొనసాగింది. తూప్రాన్ పట్టణంలోని ఉజ్జయిని మహంకాళి జాతర రెండోరోజైన సోమవారం లింగగావు, కుంభగావు, భవిష్యవాణి నిర్వహించారు. రాత్రి వివిధ సంఘాల ఆధ్వర్యంలో తొట్టెల ఊరేగింపు చేపట్టారు. నర్సాపూర్ పట్టణంలో గ్రామదేవతల బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నల్లపోచమ్మ, భూలక్ష్మీఅమ్మవారు, దుర్గామాత ఆలయాల్లో మహిళలు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా పోతురాజులు, శివసత్తుల నృత్యాలతో పాటు ప్రత్యేకంగా అలంకరించిన పలహారం బండ్లు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవులరాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు. శివ్వంపేట మండలంలోని గోమారం గ్రామంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి కుమారులు శ్రీనివాస్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫలహారం బండి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. మాజీ ఎంపీపీ హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ మహేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు. జోగిపేటలోని బృందావన్ కాలనీ మహిళలు సోమవారం భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను నిర్వహించారు. అనంతరం కాలనీవాసులు సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పాండు, కాలనీ అధ్యక్షుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అల్లె శ్రీకాంత్, కౌన్సిలర్ నాగరాజు, కాలనీవాసులు పాల్గొన్నారు. పుల్కల్, చౌటకూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో స్థానిక గ్రామ దేవతల విగ్రహాలకు ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొన్నది.




శివ్వంపేట మండలం గోమారంలో పలహారం బండి ఊరేగింపులో ఎమ్మెల్యే సునీతారెడ్డి, జోగిపేటలో బోనాలతో మహిళలు

పోలీస్ గ్రీవెన్స్ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జూలై 29: పోలీసు గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.


కొల్చారం పోలీస్ స్టేషన్‌లో పిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ

కొల్చారం, హవేళిఘణపూర్ పీఎస్‌ల సందర్శన

కొల్చారం/హవేళిఘణపూర్, జూలై 29 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించాలని మెదక్ ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి సూచించారు. కొల్చారం, హవేళిఘనపూర్ మండల కేంద్రాల్లోని పోలీస్‌స్టేషన్‌లను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్‌రేట్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా పోలీసుల సేవల్ని వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా శాంతిభద్రతలు పరిరక్షించాలని పోలీసులకు సూచించారు. పోలీసు సిబ్బంది తరుచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు భద్రత భావాన్ని పెంపొందించాలన్నారు. డయల్ 100 కాల్స్‌పై తక్షణమే స్పందించాలన్నారు. నేరాల నియంత్రణలో ప్రజలకు నమ్మకం కలగాలంటే విజుబుల్ పోలీసింగ్‌తోనే సాధ్యపడుతుందన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ఉంటూ వారు చెప్పే సమస్యలను విని పరిష్కరించాలన్నారు. నేరాల దర్యాప్తుల్లో సాంకేతికతను వినయోగించుకుని, క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఎప్పటికప్పుడు వాహన తనిఖీలు చేపట్టాలని, డ్రంకెన్ డ్రైవ్‌పై నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, కొల్చారం ఎస్‌ఐ మహ్మద్‌గౌస్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

హైవే పొడవునా ఆక్రమణలపై కొరడా

● రోడ్డుకిరువైపులా దుకాణాలు, మొబైల్ టిఫిన్ సెంటర్ల తొలగింపు
● రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ఎన్‌హెచ్ఏఐ నిర్ణయం




హైవే రోడ్డు పరిధిలో ఏర్పాటు చేసిన వ్యాపారాల తొలగింపు, వ్యాపారాలకు అడ్డుగా ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న కందం

తూప్రాన్, జూలై 29: కశ్మీర్ నుంచి కన్యకుమారి వరకు విస్తరించి ఉన్న 44(7వ) జాతీయ రహదారి విస్తరణ చర్యలు చేపట్టిన జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) రోడ్డు ఆక్రమణ వ్యాపారాలపై కొరడా ఝులిపిస్తుంది. హైవే రోడ్డు పరిధిలో ఏర్పాటు చేసిన మొబైల్ టిఫిన్ సెంటర్లు, టీ కొట్లు, ఇతరత్రా వ్యాపారాల తొలగింపు చర్యలు చేపట్టింది. అందుకు ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల కారణంగా చెబుతున్నారు. రోడ్డు పక్క వ్యాపారాలతో ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు కోల్పోతుండగా, హైవే బౌండ్రీలో ఎలాంటి ఆస్కారం లేకుండా చేస్తున్నారు. మున్ముందు హైవే బౌండ్రీలో వాహనాలు నిలిపితే ఛార్జీలను కూడా వసూలు చేయబోతున్నారు.

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ నుంచి కామారెడ్డి (పాత నిజామాబాద్ జిల్లా) అడ్లూర్ ఎల్లారెడ్డి వరకు 113 కిలోమీటర్ల పొడవు 44 (పాత ఎన్‌హెచ్ 7)వ జాతీయ రహదారిని 2006లో నాలుగు లేన్ల రహదారిగా విస్తరణ పనులు చేపట్టి 2009లో పూర్తి చేశారు. ఈ రోడ్డు పక్కన చిరు వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. మొబైల్ టిఫిన్ సెంటర్లు, టీ దుకాణాలు, ఇతరత్రా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్కటిగా హైవే పొడవునా చిరు వ్యాపారాలు పెరిగిపోయాయి. హైవే పక్కన (బౌండ్రీలో) ఏర్పాటు చేసిన వ్యాపారాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో రోడ్డు పక్కన ఉన్న దుకాణాల్లోకి వాహనం దూసుకుపోవడంతో విలువైన ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఎన్‌హెచ్ఏఐ సీరియస్‌గా తీసుకున్నది. దీంతో హైవే పక్కన ఏర్పాటు చేసిన వ్యాపారాలను తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. జీఎంఆర్ సంస్థ నిర్వహణలో ఉన్న కామారెడ్డి జిల్లా అడ్లూర్ ఎల్లారెడ్డి నుంచి మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ వరకు 113 కిలోమీటర్ల పొడవునా ఆక్రమణలు తొలగిస్తున్నారు. హైవే పక్కన ఎలాంటి వ్యాపారాలు చేయరాదంటూ సూచిస్తున్నారు. అలాగే హైవే పక్కన వెలసిన దాబా, హోటళ్లకు సైతం నోటీసులు జారీ చేశారు. దాబా, హోటళ్ల ముందు వాహనాల పార్కింగ్ చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని నోటీసులు వివరించారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ నుంచి బోయిన్‌పల్లి వరకు 27కిలోమీటర్ల పొడవు 44వ జాతీయ రహదారిని ఆరులేన్ల రోడ్డుగా విస్తరిస్తున్నారు. ఈ పనులు చేపట్టే ప్రదేశంలో ముందస్తుగా హైవే పరిధిలో ఎలాంటి వ్యాపారాలు కొనసాగించకుండా చర్యలు తీసుకుంటున్నారు. హైవే మీదకు రాకుండా ఏర్పాట్లు చేస్తు, సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేస్తున్నారు.

హైవే రోడ్డుపై నిలిపితే జరిమానాలు..!

హైవే రోడ్డు పొడువునా, పక్కన వాహనాల పార్కింగ్ చేస్తే భారీగా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. టోల్‌రుసుం చెల్లింపులు చేసినట్లుగా ఫాస్టాగ్ సహాయంతో వసూలు చేయబోతున్నారు. ఈ విషయంలో ఎన్‌హెచ్ఏఐ సీరియస్‌గా తీసుకోబోతుంది. శాటిలైట్ ఆధారంగా జీపీఆర్ఎస్‌తో ఛార్జీలు వసూలు చేయబోతున్నట్లు తెలిసింది.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వారసత్వ వీఆర్ఏల సంఘం నాయకులు

వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలి

- వారసత్వ వీఆర్ఏల సంఘం సిద్దిపేట అధ్యక్షుడు గుడుమల్ల రాజలింగం

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 29: జీవో 81,85 ప్రకారం 61 ఏళ్ల నిండిన 3,797 మంది వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలని వారసత్వ వీఆర్ఏల సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రాజలింగం ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో వారసత్వ వీఆర్ఏల సంఘం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 61 ఏళ్ల నిండిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాల నియామకానికి సంబంధించి చర్చించారు. అనంతరం ప్రభుత్వం వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజలింగం మాట్లాడుతూ.. తమకు ఉద్యోగాలు కల్పిస్తామని మాట ఇచ్చి సంవత్సరం గడుస్తున్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు ఉద్యోగాలు కల్పించి తమ బతుకులు వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ మండలాల వీఆర్ఏలు వెంకటస్వామి, సత్యం, మహేష్, ఆసిఫ్, సంతోష్‌కుమార్, తిక్కన బాలరాజు, సుందర్ పాల్గొన్నారు.

అధ్వానంగా చేర్యాల అంబేడ్కర్ చౌరస్తా

- నీటి నిల్వతో చిత్తడిమయం, గుంతలు



అంబేడ్కర్ చౌరస్తాలో నిలిచిన వరదనీరు

చేర్యాల, జూలై 29: చేర్యాల పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చౌరస్తా అధ్వానంగా మారింది. రోజులతరబడిగా నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా మారింది. వాహనాల రాకపోకలతో చిత్తడిగా మారడంతో పాటు గుంతలు ఏర్పడ్డాయి. నామమాత్రంగా మొరంపోసినా చదును చేయకపోగా, కనీసం బ్లీచింగ్ కూడా చేయడం లేదు. ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్‌నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం కోసం మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేయడంతో రోడ్డు పక్కన పండ్ల వ్యాపారులు, చిరువ్యాపారులు తోపుడుబండ్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. కూడలి వద్ద తెలంగాణ తల్లి విగ్రహం, అమరవీరుల స్మారక స్తూపం, స్వాతంత్ర్య సమరయోధుడి స్మారకస్తూపం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలతో పాటు ఆర్టీసీ రిక్వెస్ట్ బస్టాప్ ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డు విస్తరణలో భాగంగా కొద్దిరోజుల క్రితం డ్రైన్ కాలువ నిర్మించి అమరవీరుల స్మారకస్తూపం ఆవరణలో నిలిపివేయడంతో పాటు అంబేడ్కర్ కూడలి ప్రదేశం పల్లంగా ఉండడంతో మురుగునీరు చేరి అధ్వానంగా మారుతుంది. దీంతో ప్రజలు, ప్రయాణికు లు తీవ్ర ఇబ్బందులుపడుతున్నా మునిసిపల్ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే మంజూరు చేయాలి

- తపస్ జిల్లా జనరల్ సెక్రెటరీ చిలుముల మురళీధర్

తొగుట, జూలై 29: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల డీఏలను వెంటనే మంజూరు చేయాలని తపస్ జిల్లా జనరల్ సెక్రెటరీ చిలుముల మురళీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తొగుటలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు ప్రతి ఆరునెలలకోసారి రావాల్సిన డీఏను కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా.. రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తూ నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడం తగదన్నారు. పాఠశాలల్లో స్కావెంజర్లను వెంటనే నియమించి వర్షాకాలంలో తలెత్తే సమస్య నుంచి విద్యార్థుల ఆరోగ్యాలను కాపాడాలని సూచించారు. తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు ప్రతీ ఐదేళ్లకు ఒకసారి ఇవ్వాల్సిన పీఆర్సీని ఇవ్వకుండా ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచిస్తూ కాలయాపన చేస్తుందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం కళ్లు తెరిచి పీఆర్సీ ఫిట్‌మెంట్‌ను 40 శాతానికి తగ్గకుండా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి మృతి

దుబ్బాక, జూలై 29: మతిస్థిమితం కోల్పోయి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేటకు చెందిన కాస్తి చంద్రయ్య కుమారుడు సాయి(27)కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లయినప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోవడంతో భార్య విడాకులిచ్చింది. ఈ క్రమంలో సాయి తల్లిదండ్రులను కొడుతూ పిచ్చిగా ప్రవర్తించేవాడు. ఇటీవల కౌన్సిలర్ కారు అద్దాలు పగులగొట్టాడు. ఈనెల 24న తాను చనిపోతాననీ, డబ్బులు ఇవ్వాల్సిందిగా తల్లిదండ్రులతో గొడవపడ్డారు. డబ్బులు ఇవ్వకపోవడంతో అదేరోజు రాత్రి ఇంట్లో ఉన్న డీజిల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలకు తాళలేక పక్కనే ఉన్న నీటి కుండిలో మునిగి, పైకి వచ్చి కిందపడిపోయాడు. కుటుంబీకులు అతడిని 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చోరీ

చేర్యాల, జూలై 29: చేర్యాల మండలం ముస్త్యాల గ్రామశివారులోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని ఆగంతకులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ తలుపులు ధ్వంసం చేసి గర్భాలయంలోకి చొరబడి అమ్మవారి బంగారు ముక్కుపోగుతో పాటు ఆవరణలోని ఇత్తడి గంటలను అపహరించుకుపోయారు. సోమవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో విచారణ చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చేర్యాల, 29: నంగునూరు మండలం ఖాతా గ్రామం నుంచి ఆదివారం రాత్రి చేర్యాల పట్టణానికి అక్రమంగా ఇసుకలోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను స్థానికులు పట్టుకున్నారు. పోలీసులకు తెలపడంతో స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా అనుమతులు లేకుండా పలువురు చేర్యాల, మద్దూరు మండలాల్లోని పలు గ్రామాలతో పాటు ఖాతా గ్రామం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రానున్న స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

- బీజేపీ మండలాధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి



మండల కార్యవర్గ సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు

మర్కుక్, జూలై 29: రానున్న స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి, సీనియర్ నాయకులు సింగం సత్తయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను మరిచి.. వాటికి నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. బీసీ, ఎస్సీ రైతు డిక్లరేషన్ అంటూ ఓట్లు వేయించుకొని వారు చెప్పిన డిక్లరేషన్‌కి బడ్జెట్ కేటాయింపులు చేయలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆ దిశగా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు రమేష్‌గుప్తా, కానుకుంటి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా ఉపాధ్యక్షులు కుడిక్యాల రాములు, రాజేందర్‌సింగ్, బీజేవైఎం జనరల్ సెక్రెటరీ కొండ బాలకృష్ణ పాల్గొన్నారు.

సమాచారం

నేడు రెండోవిడత 'రుణమాఫీ' విడుదల

సంగారెడ్డి అర్బన్, జూలై 29: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ రెండో విడత నిధులను ప్రభుత్వం జూలై 30న ఉదయం 12 గంటలకు సీఎం అసెంబ్లీ ప్రాంగణం నుంచి విడుదల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. మంగళవారం ఉదయం 12 గంటలకు సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, రైతులు అధికారుల సమక్షంలో రెండో విడత రుణమాఫీ కార్యక్రమం జరుగుతుందన్నారు. రుణమాఫీ కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది సహకార శాఖ సిబ్బంది బ్యాంక్ సిబ్బంది పాల్గొంటారని, ఈ కార్యక్రమంలో రుణమాఫీ లబ్ధిదారులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

జాతీయ వినియోగదారుల కమిషన్ జిల్లా చైర్‌పర్సన్‌గా అరుణ చక్రవర్తుల

పటాన్‌చెరు, జూలై 29: జాతీయ వినియోగదారుల కమిషన్ సంగారెడ్డి జిల్లా కమిటీ చైర్‌పర్సన్‌గా బీరంగూడకు చెందిన అరుణ చక్రవర్తులను నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన వినియోగదారుల హక్కుల కమిషన్ జాతీయ కార్యవర్గసమావేశంలో అరుణచక్రవర్తులకు సంగారెడ్డి జిల్లా చైర్‌పర్సన్‌గా నియమిస్తూ జాతీయ చైర్మన్ ఎంవీఎల్ నాగేశ్వరావు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో వినియోగదారుల హక్కులపై చైతన్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర చైర్మన్ నల్లమాస శ్రీకాంత్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఆలయాన్ని సందర్శించిన జిల్లా కోర్టు న్యాయాధికారి

జిన్నారం, జూలై 29: మండలంలోని కొడకంచి ఆదినారాయణస్వామి ఆలయాన్ని జిల్లా కోర్టు న్యాయమూర్తి భవానీచంద్ర సందర్శించారు. సోమవారం ఆదినారాయణస్వామి ఆలయాన్ని కుటుంబసమేతంగా సందర్శించిన న్యాయమూర్తి భవానీచంద్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రామాజీరావు, మాజీ సర్పంచ్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తిగుల్‌లో గ్రామ కంఠం భూమి కబ్జా

- నిలదీసిన కాలనీవాసులు



గ్రామ కంఠం భూమిని కబ్జా చేసిన వ్యక్తిని నిలదీస్తున్న గ్రామస్థులు

జగదేవ్‌పూర్, జూలై 29: జగదేవ్‌పూర్ మండలం తిగుల్‌లో గ్రామ కంఠం భూమి కబ్జాకు గురైంది. ఈ విషయం తెలుసుకున్న కాలనీవాసులు, గ్రామస్థులు సోమవారం కబ్జాకు గురైన స్థలం వద్దకు వెళ్లి కబ్జాదారుడు మహేష్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1982లో అప్పటి ప్రభుత్వం దళితులకు ఇళ్లస్థలాల కోసం సర్వే నంబరు 768, 769లో ఉన్న ప్రభుత్వ స్థలాలను ఇళ్లు లేని పేదలకు పంపిణీ చేసిందన్నారు. అలాగే నాలుగు గుంటల స్థలాన్ని కమ్యూనిటీ భవనం కోసం కేటాయించిందని తెలిపారు. ఆ స్థలాన్ని ఓ వ్యక్తి రెండేళ్ల నుంచి ఆక్రమించుకుని ఇసుక దందా నిర్వహిస్తున్నాడని వాపోయారు. ఇటీవల ఆ స్థలం అసైన్‌మెంట్ నంబరు తప్పుడుగా చూపించి, పత్రాలు సృష్టించి గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా మ్యూటేషన్ చేయించుకున్నారని వివరించారు. ఈ విషయంపై కార్యదర్శిని అడగ్గా తనకు తెలియదని పొంతన లేని సమాధానం చెప్పారని పేర్కొన్నారు. స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, గ్రామ కంఠం భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు రామస్వామి, రామమల్లయ్య, నాగరాజు, మల్లేశం, అంజనేయులు, నర్సయ్య, పరశురామ్, మహేందర్, ఉపేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్ గౌడ్

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్ గౌడ్

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 29: కామారెడ్డి సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్ తూచా తప్పకుండా అమలు పరచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. హరియాణా, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో బీసీలకు 60 నుంచి 70 శాతం వరకు రిజర్వేషన్లు అందుతున్నాయన్నారు. కానీ తెలంగాణలో మాత్రం బీసీలు రిజర్వేషన్లకు, సంక్షేమ పథకాలకు ఆమడ దూరంలో నిలిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ప్రతి సంవత్సరం బడ్జెట్లో బీసీ సంక్షేమ కోసం రూ.20 వేల కోట్ల కేటాయిస్తామని చెప్పి మొన్న బడ్జెట్లో రూ.9 వేల కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో అనిల్‌కుమార్, సాయికుమార్, పవన్, భార్గవ్‌గౌడ్, ప్రభు, నరేందర్‌గౌడ్, వెంకటేష్, సంతోష్ గౌడ్, గణేష్, అరుణ్, చంద్రబాబు, స్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది వాస్తవ బడ్జెట్: మొగుళ్ల రాజిరెడ్డి

చేర్యాల, జూలై 29: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి అన్నారు. సోమవారం చేర్యాలలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రతిపక్షాలు, ప్రశ్నించే గొంతుకలకు సంకెళ్లువేసి అక్రమ నిర్బంధాలు చేసిందని, కానీ ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో స్వేచ్ఛ వాతావరణం కల్పించారన్నారు. బీఆర్ఎస్ అప్పులకుప్పగా చేసిన రాష్ట్రాన్ని సక్రమ పద్ధతిలో తీర్చిదిద్దుతూనే ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ అభివృద్ధి జరుపుతున్నారని పేర్కొన్నారు. నాడు బీఆర్ఎస్ అప్పులకు ప్రాధాన్యతనిచ్చి ఊహాల బడ్జెట్ ప్రవేశపెడితే కాంగ్రెస్ అభివృద్ధి ఆలోచనతో వాస్తవ బడ్జెట్ రూపకల్పన చేసిందన్నారు. ఏకకాలంలో రైతు రుణమాఫీతో రాష్ట్రంలో అన్నదాతలు సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ ఆదరణను జీర్ణించుకోలేక అక్కసు వెళ్లగక్కుతున్న బీఆర్ఎస్‌కు ఇక పుట్టగతులుండవన్నారు. కాంగ్రెస్ హవా కొనసాగుతుందని, బీఆర్ఎస్ భూస్థాపితమేనన్నారు.

స్థానిక సంస్థల్లో కాషాయజెండా ఎగరేయాలి

- కార్యకర్తలు బూత్‌లవారీగా పని చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగిడి మోహన్‌రెడ్డి



దుబ్బాకలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగిడి మోహన్‌రెడ్డి

దుబ్బాక, జూలై 29: స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలోని అన్ని గ్రామాల్లో కాషాయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగిడి మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన దుబ్బాకలోని వర్తక సంఘంలో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల బడ్జెట్ అని అన్నారు. ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయనీ, వాటిని కార్యకర్తలు గ్రామస్థాయిలో తిప్పికొట్టాలన్నారు. తెలంగాణకు నయాపైసా ఇవ్వలేదనే ప్రచారం అవాస్తవమన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు గడపగడపకు తిరిగి తెలంగాణ కోసం కేంద్రం కేటాయించిన నిధులను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలేష్‌గౌడ్, ఎస్ఎన్‌చారి, తుల ఉమా, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

చేర్యాల, జూలై 29: కొమురవెల్లి మండల కేంద్రానికి చెందిన పలువురు సోమవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జి.మోహన్‌రెడ్డి కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ సంస్థాగత బలోపేతం కోసం చిత్తశుద్ధితో పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి, ఉపాధ్యక్షుడు బూరుగు సురేశ్, మండల ప్రధాన కార్యదర్శి ఎక్కలదేవి మధు, బీజేవైఎం మండలాధ్యక్షుడు సానాది కరుణాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 7న మాల మహానాడు దీక్షలు

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు



దీక్షల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

హుస్నాబాద్‌రూరల్, జూలై 29: ఆగస్టు 7, 8, 9 తేదీల్లో ఢిల్లీలో జరిగే మాల మహానాడు దీక్షలను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో దీక్షల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పలు సామాజిక సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలోని పార్లమెంట్ వీధిలో సామాజిక చైతన్య దీక్షలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లావ్యాప్తంగా ఉన్న మాలలు, దళితులు భారీఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బత్తుల రాజయ్య, వెన్న వెంకటయ్య, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

డీలర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

- రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దొమ్మాట రవీందర్



మాట్లాడుతున్న రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్

మద్దూరు, జూలై 29: మద్దూరు మండలం ఉప్పరోనిగడ్డ, వంగపల్లి గ్రామాల రేషన్ డీలర్ జయరావు అకాల మృతి బాధాకరమని, మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దొమ్మాట రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం జయరావు అంత్యక్రియల్లో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నుంచి డీలర్ కుటుంబానికి రావాల్సిన బెనిఫిట్స్‌ను తప్పకుండా కుటుంబానికి అందేవిధంగా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి చంద్రం, డీలర్ల సంఘం అధ్యక్షుడు కరీముద్దీన్, ఉపాధ్యక్షుడు భూపతిరెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు సంజీవరెడ్డి, దూళిమిట్ట మండలాధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో ఆషాఢమాసం బోనాలు



బోనాలతో విద్యార్థినులు

మద్దూరు, జూలై 29: మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సోమవారం ఆషాఢమాసం సందర్భంగా ఎస్‌వో స్వప్న ఆధ్వర్యంలో విద్యార్థినులు బోనాలను నిర్వహించుకున్నారు. పోతరాజు వేషధారణతో విద్యార్థినులు అలరించారు. బెల్లంతో ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదాన్ని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యాపరిరక్షణ కమిటీ నాయకులు

'విద్య'కు 20 శాతం నిధులు కేటాయించాలి

సంగారెడ్డి అర్బన్, జూలై 29 : విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఐబీ అమరవీరుల స్థూపం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణ విద్యా రంగంలో 35 వ స్థానానికి దిగజారిందన్నారు. రూ. 2,91,159 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యకు కేవలం రూ.21,292 కోట్ల నిధులు కేటాయించడం అత్యంత దారుణమన్నారు. విద్యాభివృద్ధికి 20 శాతం నిధులు కేటాయించే వరకు విద్యాపరిరక్షణ కమిటీ పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు లక్ష్మయ్యయాదవ్, సంజీవయ్య, సోమశేఖర్, భాస్కర్, ఉపాధ్యక్షుడు నాసర్‌పటేల్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నేడు చలో హైదరాబాద్



సమావేశంలో మట్లాడుతున్న రవికుమార్

హుస్నాబాద్‌రూరల్, జూలై 29: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని తదితర డిమాండ్లతో ఈనెల 30న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మండలాధ్యక్షుడు సమ్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రవికుమార్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడునెలలు గడుస్తున్నా పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం చెందిందన్నారు. ప్రతీ కార్మికుడికి రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ప్రమాదబీమా రూ.10 లక్షలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంపత్, మహేందర్, సదానందం, శ్రీనివాస్, సమ్మయ్య, అజయ్, వెంకటయ్య, కుమార్, శ్రీకాంత్, సారయ్య పాల్గొన్నారు.

టీజీపీఎస్సీలో శ్రావ్యరెడ్డికి స్టేట్ థర్డ్ ర్యాంకు



శ్రావ్యరెడ్డి

సిద్దిపేట అర్బన్, జూలై 29: టీజీపీఎస్సీలో సిద్దిపేటకు చెందిన శ్రావ్యరెడ్డి స్టేట్ మూడోర్యాంకు, మల్టీ జోన్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించింది. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ కామర్స్ లెక్చరర్‌గా అర్హత సాధించి ఇంకా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న శ్రావ్యరెడ్డి.. ప్రస్తుతం టీజీపీఎస్సీలో జూనియర్ లెక్చరర్‌గా ఎన్నికయ్యారు. తండ్రి వృత్తి రీత్యా అధ్యాపకుడు. తల్లి గృహిణి, అన్నయ్య పంచాయతీ కార్యదర్శి పనిచేస్తున్నారు. ర్యాంకు సాధించిన శ్రావ్యరెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు విజయనరసింహ



విజయనరసింహను అభినందిస్తున్న దృశ్యం

సిద్దిపేట అర్బన్, జూలై 29: విశాఖపట్నంలో ఆగస్టు 1 నుంచి 4వ తేదీవరకు జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎం.విజయనరసింహ ఎంపికైనట్లు తైక్వాండ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా తైక్వాండో రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌గౌడ్, తైక్వాండో రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, తైక్వాండో సిద్దిపేట జిల్లా గౌరవాధ్యక్షుడు వేలేటి రాధాకృష్ణశర్మ, తైక్వాండో జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.రామ్మోహన్, మెరీడియన్ విద్యాసంస్థల డైరెక్టర్ వంగ దేవేందర్‌రెడ్డి విద్యార్థిని అభినందించారు.



ఘనంగా గోరింటాకు మహోత్సవం

సిద్దిపేటలోని వ్యాస మహర్షి యోగా సొసైటీ, యూటీఎంఏ సంయుక్తాధ్వర్యంలో సోమవారం గోరింటాకు మహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి బీసీ సంక్షేమ, అభివృద్ధి అధికారి సరోజ, మహిళలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల వర్షాకాలంలో మహిళలకు తలెత్తే ఆరోగ్య సమస్యలను దూరం చేస్తుందన్నారు.

- సిద్దిపేట అర్బన్